అదితి, నేహా పసిడి పట్టు

అండర్-17 ప్రపంచ రెజ్లింగ్ టోర్నీ

అమ్మన్ (జోర్డాన్): భారత యువ రెజ్లర్లు అదితి కుమారి, నేహా సంగ్వాన్, పుల్కిత్ స్వర్ణ పతకాలతో మెరిశారు. జోర్డాన్‌లో జరుగుతున్న అండర్-17 వరల్డ్ చాంపియన్‌షిప్స్‌లో భాగంగా గురువారం జరిగిన మహిళల 43 కిలోల ఫైనల్‌లో అదితి పసిడి నెగ్గింది. 57 కిలోల ఫైనల్‌లో నేహా 10-0తో జపాన్ రెజ్లర్ సా సుట్సుయ్‌ను ఓడించి స్వర్ణం గెలిచింది. నేహాది ప్రముఖ రెజ్లర్ వినేశ్ ఫోగాట్ స్వగ్రామం (హర్యానాలోని బలాలీ) కావడం గమనార్హం. 65 కిలోల విభాగంలో పుల్కిత్ సైతం స్వర్ణం సాధించింది. ఇదే టోర్నీ గ్రీకో రోమన్ ఈవెంట్‌లో భారత్‌కు రెండు కాంస్యాలు దక్కాయి.

టీటీకి అర్చనా కామత్ గుడ్‌బై

- **ఉన్నత చదువుల కోసం ఆటకు వీడ్కోలు**

ఢిల్లీ: భారత యువ టేబుల్ టెన్నిస్ (టీటీ) క్రీడాకారిణి అర్చనా గిరీష్ కామత్ అనూహ్య నిర్ణయం తీసుకుంది. 24 ఏండ్ల వయసున్న అర్చన ఆటకు వీడ్కోలు పలుకుతూ అందర్నీ ఆశ్చర్యంలో ముంచెత్తింది. ఉన్నత చదువుల నిమిత్తం ఆమె తనకు ఎంతో ఇష్టమైన టీటీని వదిలేస్తున్నట్టు తెలిపింది. ఇటీవలే ముగిసిన పారిస్ ఒలింపిక్స్‌లో భాగంగా మహిళల టీమ్ ఈవెంట్‌లో క్వార్టర్స్ చేరిన భారత జట్టులో కామత్ కూడా ఉంది. క్వార్టర్స్‌లో జర్మనీ చేతిలో 3-1 తేడాతో భారత్ ఓడగా ఆ పోరులో గెలిచిన ఏకైక భారత ప్యాడ్లర్ అర్చనానే కావడం గమనార్హం. పారిస్ నుంచి తిరిగొచ్చాక తన కోచ్‌తో సుదీర్ఘంగా చర్చించిన ఆమె ఆటకు వీడ్కోలు పలికేందుకే సిద్ధమైనట్టు తెలుస్తోంది. కాగా పదో తరగతిలో 98.7 శాతం, ఇంటర్‌లో 97 శాతం మార్కులతో చదువులో టాపర్‌గా ఉన్న అర్చన భవిష్యత్‌లో 'ఆర్థిక శాస్త్రవేత్త'గా మారి దేశానికి సేవ చేయాలని భావిస్తున్నట్టు తెలిపింది.

సత్తాచాటిన వంశీ

హైదరాబాద్, ఆట ప్రతినిధి: కోల్‌కతా వేదికగా జరుగుతున్న 50వ సీనియర్ జాతీయ పవర్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ యువ లిఫ్టర్ మోడం వంశీ సత్తాచాటాడు. గురువారం జరిగిన పురుషుల 66కిలోల విభాగం స్క్వాట్‌లో వంశీ వ్యక్తిగత పసిడి పతకంతో మెరిశాడు. ఓవరాల్‌గా మూడో స్థానంతో కాంస్యాన్ని ఖాతాలో వేసుకున్నాడు. అక్టోబర్‌లో దక్షిణాఫ్రికా వేదికగా జరిగే కామన్వెల్త్ పవర్‌లిఫ్టింగ్ టోర్నీలో వంశీ..భారత జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు.

ప్రిక్వార్టర్స్‌లో ఓడిన సతీష్

- **జపాన్ ఓపెన్‌లో ముగిసిన భారత్ పోరాటం**

యోకోహమ : జపాన్ ఓపెన్ సూపర్-750 బ్యాడ్మింటన్‌లో భారత షట్లర్ల పోరాటం ముగిసింది. ఈ టోర్నీలో భారత్ నుంచి ప్రిక్వార్టర్స్ చేరిన ఏకైక యువషట్లర్ సతీష్ కుమార్ పోరాడి ఓడాడు. పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్స్‌లో సతీష్.. 21-18, 18-21, 18-21తో కంటఫోన్ వాంగ్‌చరొయెన్ చేతిలో ఓడాడు. గంటా పది నిమిషాల పాటు సాగిన ఈ మ్యాచ్‌లో తొలి సెట్‌ను గెలుచుకున్న సతీష్ ఆ తర్వాత గాడి తప్పాడు. మాళవిక, అష్మిత, ఆకర్షి, కిరణ్ జార్జి వంటి షట్లర్లు తొలి రౌండ్‌లోనే ఇంటిబాట పట్టిన విషయం విదితమే.

పాక్ 448/6

రిజ్వాన్, షకీల్ శతకాల మోత

రావల్పిండి: స్వదేశంలో బంగ్లాదేశ్‌తో ఆడుతున్న తొలి టెస్టులో పాకిస్థాన్ భారీ స్కోరు సాధించింది. రెండో రోజు పాక్.. 113 ఓవర్లలో 448/6 పరుగుల వద్ద తొలి ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. ఓవర్‌నైట్ స్కోరు 158/4 వద్ద ఆట ఆరంభించిన పాకిస్థాన్.. వికెట్ కీపర్ బ్యాటర్ మహ్మద్ రిజ్వాన్ (171), యువ ఆటగాడు సౌద్ షకీల్ (141) శతకాలతో భారీ స్కోరు సాధించింది. రెండో రోజు ఆట ముగిసే సమయానికి బంగ్లా 12 ఓవర్ల పాటు బ్యాటింగ్ చేసి వికెట్లేమీ నష్టపోకుండా 27 పరుగులు చేసింది.

ఆధిక్యంలో ఇంగ్లండ్

శ్రీలంక 236 ఆలౌట్

మాంచెస్టర్: శ్రీలంకతో మాంచెస్టర్ వేదికగా జరుగుతున్న తొలి టెస్టులో ఇంగ్లండ్ రెండో రోజూ ఆధిక్యం కొనసాగించింది. తొలి ఇన్నింగ్స్‌లో లంకేయులను 236 పరుగులకే ఆలౌట్ చేసిన ఇంగ్లండ్.. బ్యాటింగ్ చేస్తూ రెండో రోజు ఆట ముగిసే సమయానికి 6 వికెట్లు కోల్పోయి 259 పరుగులు చేసింది. జెమీ స్మిత్ (72 నాటౌట్), హ్యారీ బ్రూక్ (56) అర్ధ సెంచరీలతో రాణించడంతో ఆ జట్టు 23 పరుగుల స్వల్ప ఆధిక్యంలో నిలిచింది.

సాట్స్ లోగో కాపీ

చారిత్రక చిహ్నాన్ని మార్చేసిన రాష్ట్ర ప్రభుత్వం

నకలు లోగోకు కలరింగ్

పాత లోగో

కొత్త లోగో

నకలు లోగో

హైదరాబాద్, ఆగస్టు 22(నమస్తే తెలంగాణ): తెలంగాణలో చారిత్రక చిహ్నాల మార్పు కొనసాగుతున్నది. చారిత్రక వారసత్వానికి ప్రతిబింబంగా భావించే కాకతీయుల కళాతోరణాన్ని కనుమరుగు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కంకణం కట్టుకుంది. ఇప్పటికే రాష్ట్ర అధికారిక చిహ్నం మార్చేందుకు ప్రయత్నించి అభాసుపాలైన ప్రభుత్వం..తాజాగా స్పోర్ట్ అథారిటీ ఆఫ్ తెలంగాణ(సాట్స్) లోగోను మార్చేసింది. పాత లోగోను పూర్తిగా మార్చేస్తూ కొత్త లోగోను కాపీ, పేస్ట్ చేసింది. ఇప్పటి వరకు ఉన్న సాట్స్ లోగోలో కాకతీయ కళాతోరణానికి తోడు ఇరువైపులా ఆయా క్రీడావిభాగాలను ప్రతిబింబిస్తూ క్లిప్‌ఆర్ట్స్, మధ్యలో ట్రోఫీతో చూడటానికి ఆకర్షణీయంగా కనిపించేది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం.. సాట్స్ లోగోను ఉన్నఫళంగా మార్చేసింది. చారిత్రక ఆనవాళ్లు ఎక్కడా కనిపించకుండా జాగ్రత్త పడ్డ ప్రభుత్వం.. కొత్త లోగోను కూడా నకలు కొట్టి నవ్వుల పాలైంది. ఆశాయె(రోప్కి ఉమీ దోంకా)2015 లోగోను అచ్చు గుద్దినట్లు దించేసింది. ఈ లోగోను సీఎం రేవంత్ రెడ్డి గురువారం సచివాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వ క్రీడా సలహాదారు జితేందర్‌రెడ్డి, సాట్స్ చైర్మన్ శివాసేనారెడ్డి, సాట్స్ ఎండీ సోనీబాలదేవి పాల్గొన్నారు. సాట్స్ లోగో మార్పుపై క్రీడాభిమానులను పెదవి విరుస్తున్నారు. ఎలాంటి చారిత్రక ఆనవాళ్లకు ఆస్కారం లేకుండా లోగోను డిజైన్ చేయడంపై సోషల్‌మీడియాలో విమర్శలు వ్యక్తం చేస్తున్నారు.

ఇంగ్లండ్ సిరీస్‌తో వేట మొదలు

2025-27 డబ్ల్యూటీసీ సైకిల్‌లో భారత్ తొలిపోరు • ఐదు టెస్టులకు షెడ్యూల్, వేదికలు ఖరారు • లార్డ్స్‌లో మహిళల జట్ల మధ్య చారిత్రక టెస్టు

లండన్: తదుపరి ఐసీసీ వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ, 2025-27) సైకిల్‌ను భారత జట్టు ఇంగ్లండ్‌తో జరుగబోయే ఐదు టెస్టులతో ఆరంభించనుంది. ప్రస్తుత సైకిల్ (2023-25) వచ్చే ఏడాది జూన్‌తో ముగియనుండగా అప్పటికి టాప్-2లో ఉన్న జట్లు డబ్ల్యూటీసీ ట్రోఫీ కోసం తలపడతాయి. జూన్‌లో జరుగనున్న 2023-25 సైకిల్ ఫైనల్‌లో భారత్ వరుసగా మూడోసారి తుదిపోరుకు అర్హత సాధించే అవకాశాలు మెండుగా ఉన్నాయి. డబ్ల్యూటీసీ ఫైనల్ ముగిసిన వెంటనే రోహిత్ సేన ఇంగ్లండ్‌తో ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌తో వేట మొదలుపెట్టనుంది. ఈ మేరకు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ), ఇంగ్లండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) సంయుక్తంగా షెడ్యూల్‌ను ప్రకటించాయి. జూన్ 20 నుంచి ఆగస్టు 4 దాకా జరుగబోయే ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లో భాగంగా హెడింగ్లీ (లీడ్స్), ఎడ్జ్‌బాస్టన్ (బర్మింగ్‌హామ్), లార్డ్స్ (లండన్), ఓల్డ్ ట్రాఫర్డ్ (మాంచెస్టర్), ది ఓవల్ (లండన్) వేదికలను ఈసీబీ ఖరారు చేసింది. 2021లో చివరి సారిగా విరాట్ కోహ్లీ సారథ్యంలోని భారత జట్టు ఇంగ్లండ్ పర్యటనకు వెళ్లగా ఐదు మ్యాచ్‌ల సిరీస్ 2-2తో సమం అయింది.

'క్రికెట్ మక్కా'లో మహిళల టెస్టు

ప్రపంచవ్యాప్తంగా అభిమానులు 'క్రికెట్ మక్కా' అని పిలుచుకునే ప్రఖ్యాత లార్డ్స్ క్రికెట్ స్టేడియం తొలిసారిగా మహిళల టెస్టు మ్యాచ్‌కు ఆతిథ్యమివ్వనుంది. భారత్, ఇంగ్లండ్ మహిళల మధ్య 2026లో జరుగబోయే ఏకైక టెస్టు లార్డ్స్‌లో జరుగనుందని ఈసీబీ ఒక ప్రకటనలో తెలిపింది. పురుషుల జట్టుతో సమాంతరంగా భారత మహిళల జట్టూ జూన్ 1 నుంచి జూలై 25 దాకా ఇంగ్లండ్‌లో ఐదు టీ20లు, మూడు వన్డేలు ఆడనుంది. పరిమిత ఓవర్ల సిరీస్‌లు ముగిసిన తర్వాత 2026లో భారత్, ఇంగ్లండ్ లార్డ్స్‌లో ఏకైక టెస్టు మ్యాచ్ ఆడతాయని ఈసీబీ వెల్లడించింది.

యూట్యూబ్‌లో 'రొనాల్డో'తుఫాను

గంటన్నరకే కోటి దాటిన సబ్‌స్క్రైబర్లు • ఇప్పటికే డైమండ్ బటన్ సొంతం • 'మిస్టర్ బీస్ట్' రికార్డులకు ఎసరు

మ్యాడ్రిడ్: ఆధునిక ఫుట్‌బాల్ దిగ్గజం క్రిస్టియానో రొనాల్డో ప్రముఖ సామాజిక మాధ్యమం యూట్యూబ్‌లో పెనుతుఫాను సృష్టిస్తున్నాడు. ఈ వేదికలోకి అరంగేట్రం చేసిన గంటల్లోపే రికార్డు స్థాయి 'సబ్‌స్క్రిప్షన్స్'తో యూట్యూబ్ మోత మోగిపోతోంది. బుధవారం (ఆగస్టు 21) యూట్యూబ్‌లోకి 'యువర్ క్రిస్టియానో' అనే పేరుతో చానెల్‌ను క్రియేట్ చేసిన రొనాల్డో.. కేవలం 90 నిమిషాల్లోనే 10 మిలియన్ సబ్‌స్క్రిప్షన్స్ (కోటి మంది)ను దాటాడు. యూట్యూబ్ చరిత్రలో ఇంత వేగంగా 10 మిలియన్ సబ్‌స్క్రైబర్స్‌ను దాటిన చానెల్ మరొకటి లేదు. దీంతో యూట్యూబ్ అతడికి 'గోల్డెన్ బటన్'ను అందించింది. ఇందుకు సంబంధించిన వీడియోనూ అతడు తన ట్రేడ్ మార్క్ సెలబ్రేషన్ 'సూ'ను పోలినట్టుగా 'థాంక్యూ సూ..బ్‌స్క్రైబర్స్' అని పోస్ట్ చేయగా అదీ రికార్డులు బద్దలు కొడుతోంది. ఇక తనకు కాబోయే భార్యను పరిచయం చేస్తూ చేసిన వీడియోతో యూట్యూబ్ అల్లకల్లోలమే అయింది. 12 గంటల్లోనే అతడి సబ్‌స్క్రైబర్స్ సంఖ్య ఏకంగా 10 మిలియన్స్ (పది కోట్లు) దాటేసింది. యూట్యూబ్‌లో పది కోట్ల సబ్‌స్క్రిప్షన్స్ ఉన్న చానెల్‌కు 'డైమండ్ బటన్'ను అందజేస్తారు. ఇదిలా ఉండగా రొనాల్డో అభిమానుల దెబ్బకు ప్రముఖ అమెరికన్ ఇన్‌ఫ్లూయెన్సర్, వ్యాపారవేత్త అయిన మిస్టర్ బీస్ట్ యూట్యూబ్‌లో నమోదు చేసిన రికార్డులన్నీ చెల్లాచెదురవుతున్నాయి. 10 మిలియన్స్ సబ్‌స్క్రిప్షన్స్ అయ్యేందుకు బీస్ట్‌కు 132 రోజులు అవసరమైతే రొనాల్డో దానిని కేవలం 12 గంటల్లోనే అందుకున్నాడు. ప్రస్తుతం బీస్ట్‌ను 311 మిలియన్స్ (31.1 కోట్లు) మంది అనుసరిస్తుండగా రొనాల్డో (ఇప్పటికే 22 మిలియన్స్ దాటింది) అభిమానులు ఇదే ఊపు కొనసాగిస్తే మరికొన్ని గంటల్లోనే అతడు ఆ రికార్డునూ ఊదిపారేసే అవకాశముంది.

లక్నోలో మోహన్ బగాన్, ఈస్ట్ బెంగాల్ మ్యాచ్

లక్నో: భారత ఫుట్‌బాల్ చరిత్రలో అత్యంత క్రేజ్ కలిగిన మోహన్ బగాన్, ఈస్ట్ బెంగాల్ మధ్య పోరుకు ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నో ఆతిథ్యమివ్వనుంది. ఈ రెండు జట్ల మధ్య ఐదు రోజుల క్రితమే మ్యాచ్ జరగాల్సి ఉన్నా కోల్‌కతాలో మెడికో హత్య ఉదంతం తర్వాత శాంతి భద్రతలు అదుపు తప్పడంతో అది రద్దు అయింది. కాగా సెప్టెంబర్ 2న లక్నోలోని కే.డీ. సింగ్ బాబు స్టేడియంలో రెండు జట్లూ తలపడతాయని యూపీ స్పోర్ట్స్ డైరెక్టర్ ఆర్.పీ. సింగ్ తెలిపాడు. యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యానాథ్ సైతం ఈ మ్యాచ్‌ను వీక్షించే అవకాశముంది.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.